నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | శనివారం 1 జూన్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## చదువుతోనే ఉజ్వల భవిష్యత్

**కలెక్టర్ బదావత్ సంతోష్**


కలమడుగు విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

జన్నారం, మే 31 : చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ప్రతి ఒక్కరూ కష్టపడి లక్ష్యం చేరుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కలమడుగు జడ్పీ హైస్కూల్ విద్యార్థి రఘు పదో తరగతి ఫలితాల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలువగా కలెక్టర్ అభినందించారు. అలాగే నేషనల్ మీమ్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన జశ్వంత్(ప్రథమ), రాజేశ్(ద్వితీయ)ను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, జిల్లా విద్యాఅధికారి ఎస్ యాదయ్య, ఎంఈవో విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు కట్టరాజమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఒకేచోట చేరి.. సందడి చేసి..

**ద్వారక పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం**


1995-96 బ్యాచ్ విద్యార్థులు

దండేపల్లి, మే31 : మండలంలోని ద్వారక జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 1995-96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. చదువులు ముగించుకొని భవిష్యత్తును వెతుక్కుంటూ వెళ్లిన వారంతా 29 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై చేరి సందడి చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు.


మెడికల్ కాలేజీ, దవాఖాన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

# మెడికల్ కాలేజీ మంచిర్యాలకు తలమానికం

- 450 పడకల సామర్థ్యంతో మెడికల్ కళాశాల, హాస్పిటల్ నిర్మాణం
- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, మే 31: కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ మంచిర్యాల జిల్లాకు తలమానికంగా నిలుస్తుందని, గతంలో 330 పడకల సామర్థ్యమే ఉండేదని, ప్రస్తుతం 450 పడకల సామర్థ్యంతో మెడికల్ కళాశాల, హాస్పిటల్ నిర్మాణం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని కాలేజీరోడ్‌లో పాత మార్కెట్‌యార్డు ఆవరణలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ, హాస్పిటల్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం దాని సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ సర్కారులో మంచిర్యాలకు మెడికల్ కాలేజీ మంజూరైందన్నారు. కాలేజీ ఎక్కడ నిర్మించాలన్న విషయంలో చాలా ఇబ్బందులు పడ్డామని, కానీ మెడికల్ కాలేజీ, హాస్టల్‌లను గుడిపేటలో, మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉండే హాస్పిటల్‌ను మార్కెట్‌యార్డు స్థలంలో నిర్మించాలని నిర్ణయించామన్నారు. వేర్వేరు చోట్ల కట్టడం కుదరదని అధికారులు చెప్పినా పట్టుబట్టి ఇక్కడే ఉండాలని ఒప్పించినట్లు తెలిపారు. ఇక్కడ ఉన్న 10 ఎకరాల్లో హాస్పిటల్ కోసం మూడెకరాలు వాడుకుంటున్నారని, ఇంకా మిగిలిన భూమిలో ఎంసీహెచ్‌నుగాని, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను గాని నిర్మించుకోవచ్చన్నారు. అదీగాక ప్రస్తుతం ఉన్న ఏరియా హాస్పిటల్ 55 ఏళ్ల క్రితం కట్టిందని, దానిని తొలగించి ఆ స్థానంలో కూడా ఆస్పత్రులను నిర్మించవచ్చునని అన్నారు. మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని, వచ్చే ఏడాదికల్లా కొత్త భవనాల్లో కాలేజీ, హాస్టల్, హాస్పిటల్ ప్రారంభమవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించి మెడికల్ కాలేజీని మంజూరు చేసిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాదెసత్యం, అక్కూరి సుబ్బయ్య, అంకం నరేశ్, సుంకరి రమేశ్, తోట తిరుపతి, ఎర్రం తిరుపతి, సాగి వెంకటేశ్వర్‌రావు, శ్రీపతివాసు, తాజుద్దీన్ పాల్గొన్నారు.

## వారంలోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్

తిర్యాణి, మే 31 : వారంలోగా వడ్ల కొనుగోళ్ల లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు సిబ్బందిని ఆదేశించారు. గంభీరావుపేట్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అక్కడ రైతుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో అక్కడక్కడా వరి కోతలు జరుగుతున్నాయన్నారు. వారంలోగా వేగంగా ధాన్యం కొనుగోళ్లు జరిగేలా ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. లక్ష్యాన్ని అధిగమించి కొనుగోళ్లను ముగించాలని ఆదేశించారు. త్వరితగతిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సిబ్బందికి సూచించారు. అంతకుముందు తహసీల్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ధరణి పెండింగ్ రికార్డులను పూర్తిచేయాలని తహసీల్దార్, సిబ్బందికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సునీల్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ గణేశ్, ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి పవన్‌నంద తదితరులు పాల్గొన్నారు.

# రాజుకుంటున్న భూ వివాదం

**కొంతకాలంగా ఫారెస్ట్ అధికారులు, రైతుల మధ్య గొడవలు**

- ఇటీవల తుంగెడలో ఘర్షణ
- తాజాగా దానాపూర్‌లో సర్వే కోసం వచ్చిన సిబ్బందిని అడ్డుకున్న రైతులు, గ్రామస్తులు
- తీవ్రంగా ప్రతిఘటించడంతో వెనుదిరిగిన వైనం
- రోజు రోజుకూ వేధింపులు ఎక్కువ అవుతున్నాయని అన్నదాతల ఆవేదన
- గ్రామం కూడా అటవీ భూమిలోనే ఉంది : ఆసిఫాబాద్ అటవీ డివిజనల్ అధికారి అప్పలకొండ


భూముల సర్వేకోసం వచ్చిన అటవీ అధికారులను అడ్డుకుంటున్న గ్రామస్తులు, రైతులు


అటవీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న గ్రామస్తులు, రైతులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కొంతకాలంగా అటవీ శాఖ-రైతుల మధ్య భూ వివాదం రాజుకుంటుంది. 20 రోజుల క్రితం రెబ్బెన మండలం తుంగెడలో ఫారెస్ట్ అధికారులు, రైతుల మధ్య ఘర్షణ జరుగగా, తాజాగా.. శుక్రవారం ఆసిఫాబాద్ మండలం దానాపూర్‌లో భూముల సర్వే కోసం వచ్చిన అధికారులను గ్రామస్తులు, రైతులు అడ్డుకోవడం ఉద్రిక్తతలకు దారితీసింది. అటవీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇక చేసేదేమీ లేక అటవీ అధికారులు వెనుదిరుగాల్సి వచ్చింది. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను అటవీ అధికారులు సర్వేల పేరుతో లాక్కునేందుకు యత్నిస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు.

### 150 ఎకరాలు.. 62 మంది రైతులు

దానాపూర్ గ్రామ సరిహద్దులోని దాదాపు 150 ఎకరాల్లో 62 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. తరతరాలుగా ఈ భూములు రైతుల ఆధీనంలోనే ఉండగా, అటవీ శాఖ అధికారులు వాటిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రెండేళ్ల క్రితం దాదాపు 10 ఎకరాలను రైతుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. మిగతా భూమిని కూడా రైతులనుంచి స్వాధీనం చేసుకునేందుకు సర్వే పేరుతో శుక్రవారం దానాపూర్ గ్రామానికి ఆసిఫాబాద్ డివిజనల్ అటవీ అధికారి అప్పల కొండ.. తన సిబ్బందితో కలిసి రాగా, రైతులు, గ్రామస్తులు వారిని గ్రామంలోకి రాకుండా అడ్డుకున్నారు. తాము సాగు చేసుకుంటున్న భూముల్లో సర్వేలు చేయడానికి వీలు లేదని, గ్రామస్తులంతా ఏకతాటిపైకి వచ్చి ప్రతిఘటించడంతో ఆసిఫాబాద్ అటవీ డివిజన్ అధికారి అప్పల కొండ తన సిబ్బందితో కలిసి వెనుదిరుగారు. ఒక్కొక్కరికీ రెండు, మూడు ఎకరాలకంటే ఎక్కువ లేదని, దీనిని కూడా అటవీ అధికారులు తీసుకుంటే తమకు జీవనాధారం లేకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. పేదరైతులపై అటవీ అధికారుల వేధింపులు రోజు రోజుకూ ఎక్కువవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### గ్రామం కూడా అటవీ భూమిలోనే ఉంది...

*దానాపూర్ రైతులు సాగుచేసుకుంటున్న 150 ఎకరాలు మొత్తం అటవీ ప్రాంతంలోనే ఉన్నాయి. దానాపూర్ గ్రామం కూడా కొంత భాగం అటవీ భూమిలోనే ఉంది. భూముల సర్వే కోసం వెళ్తే గ్రామస్తులు అడ్డుకున్నారు. ఏమాత్రం సహకరించలేదు. నాలుగేళ్ల క్రితం 10 ఎకరాలు స్వాధీనం చేసుకున్నాం. రైతుల ఆధీనంలో ఉన్న మిగతా భూమిని కూడా సర్వే చేసి స్వాధీనం చేసుకుంటాం. గతంలో రైతులు కూడా సహకరిస్తామని చెప్పారు.*

**- అప్పల కొండ, ఆసిఫాబాద్ అటవీ డివిజనల్ అధికారి**

### 75 ఏండ్ల సంది సాగు చేస్తున్నం



*మా గ్రామ సమీపంలోని భూములను 75 ఏండ్ల సంది సాగు చేసుకుంటున్నం. 150 ఎకరాలను 62 మంది రైతులం దున్నుకుంటున్నం. నాలుగైదేళ్లుగా అటవీ అధికారులు మమ్ముల వేధిస్తున్నరు. ఇవి అటవీ భూములంటున్నరు. సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నరు. 75 ఏళ్ల నుంచి లేని అటవీ భూములు ఇప్పుడు ఎలా వచ్చాయి. మాకు జీవనాధారమైన ఈ భూములను ఎట్టిపరిస్థితుల్లో వదులుకోము. ఇకనైనా అధికారుల వేధింపులు మానుకోవాలి.*

**- లక్ష్మణ్, గ్రామ పెద్ద, రైతు**


ముత్తంపేటలో ఎరువులు, విత్తనాల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఏవో శ్రీనివాస్‌రావు

## నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్‌లు రద్దు

**డీఏవో శ్రీనివాస్‌రావు**

కౌటాల, మే 31 : రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అమ్మాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను ఎంఏవో పాలకుర్తి రాజేశ్‌తో కలిసి తనిఖీ చేశారు. విత్తన డీలర్లు నిబంధనలు పాటించాలని, రైతులకు గుర్తింపు పొందిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని సూచించారు. ఎట్టి పరిస్థితిలోనూ నకిలీ విత్తనాలు అమ్మరాదని, అలా చేస్తే దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. రైతులు విత్తనాలు కొనేసమయంలో తప్పకుండా ప్యాకెట్ వివరాలను పరిశీలించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 4 లక్షల పత్తి విత్తనాల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. అన్ని దుకాణాల్లో బీజీ2 (బోల్ గార్డ్ 2) విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. విత్తనాలు కొన్న తర్వాత తప్పకుండా రశీదు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్మితే వెంటనే సమాచారం అందించాలని కోరారు.

## టాక్స్ రివైజ్‌కు సహకరించాలి

- తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూస్తున్నాం
- మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య

మంచిర్యాలటౌన్, మే 31: టాక్స్ రివైజ్ కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్నుల రివైజేషన్ కోసం మున్సిపల్ సిబ్బంది వార్డుల్లో తిరుగుతూ ఇండ్లు కొలుస్తున్నారని, కొందరు రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని కమర్షియల్‌గా వాడుతున్నారని, మరికొందరు పై అంతస్తులు నిర్మించుకున్నారని, ఇలాంటి వాటిని గుర్తించి టాక్స్ వేయడం జరుగుతుందన్నారు. గతంలో కొందరు తక్కువ స్థలాన్ని చూపి పన్నులు తక్కువగా వేయించారని, అలాంటివారుంటే మున్సిపల్ సిబ్బందిని పిలిపించుకుని సరైన కొలతలు చేయించుకోవాలన్నారు. ట్యాక్స్ తక్కువ వేయిస్తామని చెప్పే దళారులను నమ్మవద్దని, ఎరవరకీ లంచం ఇవ్వవద్దని కోరారు. గతంలో ఆరోపణలు వచ్చిన మున్సిపల్ సిబ్బందిపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. కొత్తగా నల్లా కనెక్షన్‌లు ఇస్తున్నామని, కొన్ని ఇండ్లలో ఎక్కువ పోర్షన్‌లు ఉంటే వారికి రెండు, మూడు కనెక్షన్‌లు కూడా ఇస్తామని, ప్రతి ఇంటికీ సురక్షిత నీరు ఇవ్వడమే తమ లక్ష్యమని చెప్పారు. ఎండల కారణంగా బోర్లలో నీటి మట్టం తగ్గిందని, ఎమ్మెల్యే పీఎస్సార్ ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతిరోజూ తాగునీరు ఇవ్వాలని అధికారులను ఆదేశించారని చెప్పారు. పట్టణంలో దాదాపు 90 శాతం ఏరియాల్లో నీరు వస్తుందని, కొన్ని ప్రాంతాల్లో సాంకేతిక సమస్యలు, చిన్నచిన్నకారణాలతో నీరు అందడం లేదని, పదిరోజుల్లో వానలు వస్తాయని, ఇబ్బందులు ఉండవని అన్నారు. నల్లాలకు మోటార్లను పెట్టవద్దని సూచించారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా మున్సిపల్ కార్యాలయానికి వచ్చి చెప్పుకోవచ్చునని అన్నారు.


ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన అర్చన టెక్స్ చౌరస్తా

## భానుడి ఉగ్రరూపం

- మంచిర్యాల జిల్లాలో భగభగలు
- రాష్ట్రంలోనే అత్యధికంగా భీమారంలో 47.2 డిగ్రీలు
- తల్లడిల్లిన ప్రజలు


ఎండకు గొడుగును పట్టుకొని వెళ్తున్న నర్సింగ్ విద్యార్థినులు

మంచిర్యాలటౌన్/నెన్నెల, మే 31 : 'అబ్బ.. అగ్గి కురుస్తున్నట్లుంది.. వశమైత లేదు..' ఇప్పుడు ఎవరి నోట విన్నా ఇవే మాటలు. జిల్లాలో శుక్రవారం భానుడు గంట గంటకూ ఉగ్రరూపం దాల్చగా, ప్రజానీకం అల్లాడిపోయింది. ఉదయం లేచిన దగ్గరనుంచి సూర్యుడు నిప్పులు కక్కుతూనే ఉన్నాడు. రాష్ట్రంలో నే అత్యధికంగా భీమారంలో47.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కావడం ఆందోళన కలిగించింది. ఎండకు తోడు వేడి గాలులు వీయగా, ప్రజలు ఉక్కపోతతో తల్లడిల్లారు. మధ్యాహ్నం జన సంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. మూగజీవాలు చెట్ల నీడన చేరి సేద తీరాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వరుణ దేవుడు కరుణించాలని ప్రజలంతా ప్రార్థిస్తున్నారు.

# పచ్చిరొట్ట, పత్తి విత్తనాల పంపిణీ పకడ్బందీగా నిర్వహించాలి

**కలెక్టర్ బదావత్ సంతోష్**

హాజీపూర్, మే 31 : పచ్చిరొట్ట, పత్తి విత్తనాల పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం హాజీపూర్ మండలం పడ్తన్‌పల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పచ్చి రొట్ట విత్తనాల పంపిణీ విధానాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా 60 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో టీ-సీడ్ పోర్టల్ ద్వారా పంపిణీ జరుగుతున్న విధానం, స్టాక్ వివరాలను పరిశీలించారు. పచ్చిరొట్ట వల్ల కలిగే ప్రయోజనాన్ని రైతులకు వివరించారు. అనంతరం మల్లిఖార్జున ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేసి పత్తి విత్తనాలు, ఎరువుల స్టాక్ వివరాలను పరిశీలించారు. నకిలీ, నిషేధిత విత్తనాలు, ఎరువులను అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ సాంకేతిక అధికారి సంకె శ్రీనివాస్, మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణ, ప్రాథమిక వ్యవసాయ శాఖ పరపతి సంఘం కార్యనిర్వహణాధికారి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

### క్రీడాకారులను అభినందించిన కలెక్టర్

నస్పూర్, మే 31 : ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు మలేషియాలో జరిగిన అంతర్జాతీయ శిలంబం ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పులిశెట్టి శృతి, దొంతుల వర్ష గోల్డ్, సిల్వర్‌మెడల్స్ సాధించిన విషయం విదితమే. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్ వారిని అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు తేవడం గర్వంగా ఉందని, మున్ముందు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో శిలంబం రాష్ట్ర కార్యదర్శి కనర్తి రమేశ్, పర్యవేక్షకుడు వెంకటేశ్వర్‌రావు, డీవైఎస్‌వో రాజ్‌వీర్, ఈడీ దుర్గా ప్రసాద్, వెంకటేశ్ పాల్గొన్నారు.

## అన్ని సంఘాలకూ ఆహ్వానం ఇవ్వాలి

**టీబీజీకేఎస్ నాయకుల డిమాండ్**

శ్రీరాంపూర్, మే 31 : సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగి 5 నెలలు అవుతుందని, ఇప్పటికీ గుర్తింపు కార్మిక సంఘం గుర్తింపు పత్రం ఇవ్వనందున రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు యాజమాన్యం అన్ని కార్మిక సంఘాలకూ ఆహ్వానాలు పంపించాలని టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్, మాజీ ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. సింగరేణి కార్మికులు పోరాడి తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నారని చెప్పారు. జూన్ 2న సింగరేణిలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు కోడ్ ఆఫ్ డిసిప్లేన్ ప్రకారం అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించి, ఆహ్వాన పత్రం ఇవ్వాలన్నారు. గతేడాది టీబీజీకేఎస్ హయాంలో వేడుకల సమయంలో గుర్తింపు కార్మిక సంఘం లేనందున అన్ని కార్మిక సంఘాల నాయకులను ఆహ్వానించారని గుర్తుచేశారు. యాజమాన్యానికి పారిశ్రామిక ప్రశాంతత కల్పించాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. తెలంగాణ దశాబ్ధి ఉత్సవాల్లో తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించి, గౌరవంగా సన్మానించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు బండి రమేశ్, పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.

